పెంబర్తి చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ

తెలంగాణ శాసన సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వరంగల్ కమిషనరేట్ పోలీసులు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సిద్ధమైనారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం అర్ధ రాత్రి జనగాం జిల్లా పెంబర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చేక్ పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు తీరును పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై పోలీస్ కమిషనర్ చెక్ పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ జనగాం రైల్వే స్టేషన్ లో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలను పర్యవేక్షించారు.

కొమ్మల టోల్ ప్లాజా వద్ద రూ.3 కోట్ల విలువైన బంగారం పట్టివేత

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కొమ్మల టోల్ ప్లాజా వద్ద జరిపిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న 5.4 కిలోల బంగారాన్ని పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ రూ. 3.09 కోట్లు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. సరైన పత్రాలు చూపించ నందునే బంగారాన్ని సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

కమలంలో కయ్యం

రగిలిపోతున్న బీజేపీ సీనియర్లు

(ఆంధ్రప్రభ బ్యూరో, హైదరాబాద్) :

తెలంగాణ బీజేపీ అగ్రనేతల్లో కొందరు పార్టీ అధినాయకత్వంపై రగిలిపోతుండ గా పలువురు పార్టీ వీడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.పార్టీ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాలో కీలకమైన తమ పేర్లు లేకపోవడంతో నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ బీజేపీ లో కీలక నేతలుగా భావిస్తున్న పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ లు వివేక్ వెంకటస్వామి, జితేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్ తదితరులు ఢిల్లీ పెద్దలపై గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీలో తమకు ఏటువంటి ప్రాధాన్యం దక్కడం లేదని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము కోరిన నియోజకవర్గాల్లో కాకుండా సంబంధం లేని చోట్ల టికెట్లను ఇస్తామని చెప్పడం దేనికి సంకేతమని నిలదీస్తున్నట్లు సమాచారం.

పార్టీ వీడేందుకు రాజగోపాల్‌రెడ్డి రెడీ..

పార్టీ వీడేందుకు సిద్ధమైన మాజీ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హైదరాబాద్ లోని ఎల్బీ నగర్ సీటు ఆశించారని అయితే బీజేపీ అధినాయకత్వం మునుగోడు నుంచే పోటీ చేయాలని చెప్పడంతో వెనక్కు తగినట్లు ప్రచారం జరుగుతోంది.దీంతో అయన ఏకంగా బీజేపీ నీ వీడి సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అందుబాటులో లేకపోవడంతో రాజగోపాల్ చేరిక కార్యక్రమం ఈ నెల 26 కు వాయిదా పడినట్లు సమాచారం.మాజీ మంత్రి డీకే అరుణ మహబూబ్ నగర్ లేదా మక్తల్ అసెంబ్లీ స్థానాల్లో ఒక చోటు నుంచి పోటీకి సిద్ధమయ్యారు.పార్టీ అధినాయకత్వం మాత్రం గద్వాల నుంచి బరిలో దిగాలని కోరడంతో అందుకు ఆమె ససేమిరా అన్నట్లు సమాచారం.

డీకే అరుణ పోటీ చేయడం అనుమానమే!

లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్ నగర్ నుంచి పోటీకి సిద్ధమైన అరుణ అసెంబ్లీ కి పోటీ చేయడం అనుమానమే అన్న ప్రచారం జరుగుతోంది. గద్వాల నుంచి తనకు అత్యంత సన్నిహితుడు సీనియర్ న్యాయవాది వేంకట్రాది రెడ్డి ని ఎంపిక చేయాలని అరుణ సిఫారసు చేసినట్లు సమాచారం.మహబూబ్ నగర్ మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి అసెంబ్లీ పోటీచేయాలన్న బీజేపీ పెద్దల ఆదేశానికి నో చెప్పినట్లు తెలుస్తోంది.తాను అసెంబ్లీకి కాకుండా లోక్ సభ బరిలో ఉంటానని తన తనయుడు మిథున్ రెడ్డి కి షాద్ నగర్ అసెంబ్లీ టికెట్ ఇచ్చి ఆశీర్వదించాలని పార్టీ పెద్దలను కోరినట్లు సమాచారం.మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పేరు అభ్యర్థుల తొలిజాబితాలో కనపడక పోవడంతో రగిలి పోతున్నట్లు చెబుతున్నారు.

ధర్మపురి అడిగితే చెన్నూరు ఇస్తరా?

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మపురి టికెట్ కోసం వివేక్ ప్రయత్నించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు లో పోటీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.చెన్నూరు నుంచి పోటీ చేయనని చెప్పడంతో అభ్యర్థుల తొలి జాబితాలో అయన పేరు లేదని పార్టీ వర్గాలంటున్నాయి. అధినాయకత్వంపై గుర్రుగా ఉన్న వివేక్ పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.మరో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మునుగోడు లేదా ఇబ్రహీం పట్నం నుంచి పోటీకి దరఖాస్తు చేసుకున్నారు.రెండిట్లో తన పేరు ఉండకపోవచ్చన్న సమాచారం అందడంతో అయన అలక బూనినట్లు చెబుతున్నారు.

అధికార ప్రతినిధి రాకేశ్‌కు భంగపాటు..

ఇదిలా ఉండగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లా ముధోల్ టికెట్ రాకపోవడంతో ఆగ్రహించిన జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి పదవికి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.గోషామహల్ టికెట్ ను ఆశించిన దివంగత మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ తనయుడు విక్రమ్ గౌడ్ కు మొండి చేయే మిగిలింది.అయన ప్రత్యామ్నాయ దారులు వెతుక్కుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- అభ్యర్థుల తొలి జాబితాలో పేర్లు లేకపోవడంతో గరం గరం
- పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్న పలువురు నేతలు
- మహబూబ్ నగర్ లోక్ సభ బరిలో ఇద్దరు సీనియర్లు
- టికెట్ దక్కక పోవడంతో నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి రాజీనామా
- నేడో, రేపో పార్టీ వీడనున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- టికెట్ కేటాయింపుపై అసంతృప్తిగా ఉన్న వివేక్ వెంకటస్వామి
- డీకే అరుణ పోటీ చేయడమూ కష్టమే..
- అలకబూనిన అధికార ప్రతినిధి రాకేశ్

స్వామి నిజం గెలిపించు

తిరుమలలో తెలుగుదేశం పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో చనిపోయిన పార్టీ కార్యకర్తలు అభిమానులు కుటుంబాలను ఆమె పరామర్శించనున్నరు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, అనురాధ, రామ్ భూపాల్ రెడ్డిలతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు.

నియామవళి పేరులో ఇబ్బందులు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్

ఎన్నికల నియామవాళి పేరుతో పోలీసులు వ్యాపారస్తులను ఇబ్బందులు పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమాలు పేరుతో రహదారుల్లో వాహనాలకు అడ్డుకాచి పోలీసులు డబ్బులను సీజ్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తుంది. అయితే వ్యాపారాలు చేసుకొని ఆ డబ్బులు బ్యాంకుల్లో దాచడానికి తీసుకు వెళుతుంటే పోలీసులు ఆ డబ్బులను సీజ్ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

నిజం గెలిస్తే చంద్రబాబు జీవితాంతం జైలులోనే

తిరుమల .. నిజం గెలిస్తే జీవితకాలం చంద్రబాబు జైల్ లో ఉంటారని, ఆయనతో పాటుగా లోకేష్, భువనేశ్వరి కూడా జైల్ కి వెళ్ళే అవకాశం ఉందని ఏపి పర్యాటక శాఖ మంత్రి ఆర్.కే.రోజా తెలిపారు. మంగళవారం ఉదయం స్వామి వారి నైవేద్యం విరామ సమయంలో ఏపి పర్యాటక శాఖ మంత్రి ఆర్.కే.రోజా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దర్శనం అనంతరం విలేకరులతో మాటాడుతు ఆమె చంద్రబాబు, లోకేష్, నారా భువనేశ్వరి, పవన్ లపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు.. నిజంగా భువనేశ్వరికి నిజం గెలవాలని ఉంటే సిబిఐ ఎంక్వైరీ వేయాలని కోరాలని, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై సిబిఐ ఎంక్వైరీ వేయించుకుంటే నిజం తప్పకుండా గెలుస్తుందన్నారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలి అని గెట్టిగా శ్రీ వేంకటేశ్వరస్వామి వద్ద పూజలు చేసినట్లు ఉన్నారని, తాము కూడా నిజం గెలవాలని మనస్సు పూర్తిగా కోరుకుంటున్నామని ఆమె అన్నారు.

సునిత ప్రాంతాల్లో మార్చ్ ఫాస్ట్

నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గ కేంద్రంలో నిజాంబాద్ సీపీ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కోసం పోలీసులు బోధన్ పట్టణంలోని సునిత ప్రాంతాల్లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. బోధన్ పట్టణంలోని పలు సునిత ప్రదేశాల్లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించి బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. బిఎస్ఎఫ్ జవాన్లు 300 మంది, బోధన్ సబ్ డివిజన్ సిబ్బంది వందమంది, ఈతర సిబ్బంది పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పట్టణంలో కనిపించడంతో ప్రజలందరూ ఏమైనా సంఘటన జరిగిందా అని పట్టణ ప్రజలంతా చర్చలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ జయరాం, ఎసీపీ కిరణ్ కుమార్, సిఐ ప్రేమ్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరాజు, రుద్రూర్ సిఐ జిఎస్ రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో భ్రమరాంబికాదేవి

నిజరూప దర్శనం..

శ్రీశైలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు చివరిరోజున భక్తులకు భ్రమరాంబికాదేవి దర్శనమివ్వనున్నారు. మంగళవారం సాయంత్రం నిజరూప అలంకారంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం ఇవ్వనున్నారు. స్వామి అమ్మవార్లు నందివాహనంపై ఆసీనులై విశేష పూజాసేవలు అందుకోనున్నారు. నందివాహనంపై శ్రీ స్వామి అమ్మవారికి ఆలయ ప్రకరోత్సవం, జమ్మివృక్షం వద్ద శమీపూజలు నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి నిర్వహించనున్న శ్రీస్వామి అమ్మవార్ల తెప్పోత్సవం వేడుకతో విజయదశమి ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

రెండు రాష్ట్రాల్లోనూ
అరాచక పాలనే

- తుమ్మల హాట్ కామెంట్స్

ఖమ్మం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో దారుణమైన రాజకీయాలు నడుస్తున్నాయని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శలు గుప్పించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అరాచక పాలన కొనసాగుతోందని అన్నారు. ఖమ్మంలోని 14వ డివిజన్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇలాంటి అవినీతి, నిర్బంధ పాలన తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ప్రతీకారాలకు పాల్పడ లేదని చెప్పారు. ప్రతిపక్షాలను, ప్రజలను బెదిరించి, అదిరించి ఎల్లకాలం రాజకీయాలు చేయలేరని అన్నారు. తెలంగాణలో సుస్థిరమైన పాలన కావాలంటే కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని చెప్పారు.

పోస్టల్ బ్యాలెట్ నిబంధనలు
ఇక కఠినం

న్యూఢిల్లీ ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ శాఖల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. కొన్ని సమయాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సైతం అభ్యర్థి గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. అయితే ఎన్నికల సమయంలో పోస్టల్ బ్యాలెట్ ను తమ వద్దే ఉంచుకుని రాజకీయ పార్టీలతో ఉద్యోగులు బేరాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో సారి రాజకీయ పార్టీలే పోస్టల్ బ్యాలెట్లను తమ చేతుల్లోకి తీసుకుని ఓటు వేసుకున్న ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్లు దుర్వినియోగం అవుతున్నాయని గ్రహించిన ఎన్నికల సంఘం తాజాగా నిబంధనల్లో పలు మార్పులు చేసింది. మారిన నిబంధనల ప్రకారం ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ను తమ వద్దే ఉంచకోకుండా.. తమకు కేటాయించిన కేంద్రంలో రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. పోలింగ్ విధులు నిర్వర్తించే చోటే ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఆ కేంద్రంలో ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునే అవకాశం ఉంది. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఫారం 12, ఫారం 12ఏ ను శిక్షణ సమయంలోనే అందిస్తారు.

పండగ పూట విషాదం

- వాహనం ఢీకొని ఇద్దరు బాలికలు మృతి

జన్నారం : దసరా పండగ పూట విషాదం నెలకొంది. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు బాలికలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ చెక్కపల్లి గుంట వద్ద సోమవారం రాత్రి పొనకల్ వాసి పుప్పర్ల గంగన్న కూతురు పుప్పర్ల రాహిత్య (15), ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాగర్, జోష్న దంపతుల కూతురు సాత్విక(19)ను గంగన్న మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం రాత్రి ఢీకొనగా, ఇద్దరు బాలికలు వాహనంపై నుంచి ఎగిరి పడి తీవ్రగాయాల గురయ్యారు. తీవ్రగాయాల గురైన ఇద్దరు బాలికలను చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరు బాలికలు మృతి చెందారు. వాహనం నడిపిన గంగన్న స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన ఇద్దరి బాలికలది పొనకల్ కాపడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాల వద్ద తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్థానిక ఎస్సై పి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

చెన్నై : తమిళనాడులోని తిరువన్నమలైలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అందన్‌పూర్ బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు అక్కడి కక్కడే మృతి చెందారు. మరో 14 మంది తీవ్రం గా గాయపడ్డారు. టాటా సుమో - బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం

ఏడుగురు దుర్మరణం

ఆస్పత్రికి తరలించారు. టాటా సుమో తిరువన్నమలై నుంచి బెంగళూరు వెళ్తుండగా సేంగం వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో సుమోలో 10 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఏడుగురు చనిపోగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 10 మందికి గాయాలయ్యాయి. మొత్తం 14 మంది సెంగం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మెక్సికోలో నరమేధం

కాల్పులలో 13 మంది పోలీసులు హతం

మెక్సికో : మెక్సికోలో సోమవారం దారుణం జరిగింది. పోలీసు కాన్వాయ్‌పై గుర్తు తెలియని దుండగులు తుపాకులతో విరుచుకుపడ్డారు. పోలీసులపై బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ కాల్పుల్లో 13 మంది పోలీసులు దుర్మరణం చెందారు. ఈ కాల్పుల ఘటన మెక్సికోలోని గురెరో రాష్ట్రంలోని కోయుకడి బెనిటెజ్ నగరంలో చోటు చేసుకున్నట్లు పోలీసులు ధృవీకరించారు. జాతీయ భద్రతా విభాగానికి చెందిన ఓ సీనియర్ అధికారి ప్రయాణిస్తోన్న కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులకు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇంద్రకీలాద్రిపై
భవానీల పోటు

విజయవాడ ఇంద్రకీలాద్రికి పైకి భవానీలు పోటెత్తారు. జై దుర్గా జై జై దుర్గా నినాదాలతో ఇంద్రకీలాద్రి మార్మోగిపోతుంది. ఇవాళ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దుర్గదేవీ అమ్మవారు దర్శనం ఇస్తున్నారు. ఓం టర్నింగ్ నుంచి అమ్మవారి సన్నిధానం వరకు క్యూలైన్ లలో భక్తులు వేచి ఉన్నారు. ఇరుముడి శిరస్సున ధరించి అమ్మవారిని దర్శించుకొని భవానీలు తమ దీక్షను విరమిస్తున్నారు. శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భవాని మాలధారణలో భక్తులు తరలివస్తున్నారు.